తిలక్‌నగర్‌లో చెత్త, వరదనీరు తొలగింపు



చెత్తాచెదారం, వరదనీటిని తొలగించిన దృశ్యం

నల్లకుంట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్ మెయిన్ రోడ్ అపోలో ఫార్మసీ షాపు ఎదురుగా స్ట్రీట్ నంబర్ 11 వీధిలో నిలిచిన వరదనీరు, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జీహెచ్ఎంసీ సిబ్బంది శనివారం తొలగించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 14న 'పడకేసిన పారిశుధ్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. ఉదయం పారిశుధ్య సిబ్బందితో ఆ వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తరలించారు. వరద నీటిని నలాల్లోకి మళ్లించారు. వీధిలో రెండు వైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

నాలాపై కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

బర్కత్‌పుర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ పరిధిలో వరద నీటి కాలువ నాలాలపై కుంగిన మ్యాన్‌హోళ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని రహమత్‌బాగ్‌లో వరద నీటి కాలువ నాలాపై మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో కార్పొరేటర్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. జీహెచ్ఎంసీ డీఈతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రాహమత్‌బాగ్, బద్రుక కళాశాల లేన్ తదితర ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు లావణ్య, ఆర్. సంతోష్, టీమ్‌రాజ్, రవియాదవ్, సూరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పిల్లలకు అక్షరాభ్యాసం

చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా చేరిన పిల్లలకు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ శనివారం అక్షరాభ్యాసం చేయించారు. అమ్మ ఒడి... అంగన్‌వాడీ కార్యక్రమంలో భాగంగా జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో పావనివినయ్‌కుమార్ అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వై. నర్సమ్మ, డి. ప్రమీల, కౌసర్‌బేగం, సవిత, ఆయా మాణిక్యమ్మ, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెత్త, డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు: రవిచారి

రాంనగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బస్తీలు, కాలనీలలో మట్టి, చెత్త, డ్రైనేజీ సమస్యలు లేకుండా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కె.రవిచారి సూచించారు. డివిజన్‌లోని న్యూఅచ్చయ్యనగర్‌లో ఆయన పాదయాత్ర నిర్వహించి జీహెచ్ఎంసీ సిబ్బంది చేపడుతున్న మట్టికుప్పల తొలగింపు పనులను పరిశీలించారు. బస్తీలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాబుగౌడ్, రాకేష్, బస్తీవాసులు పాల్గొన్నారు.


పవర్ బోర్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న నవీన్‌గౌడ్

బాపూజీనగర్‌లో పవర్ బోరుకు మోక్షం

- విద్యుత్ కనెక్షన్, మరమ్మతులు చేసి అందుబాటులోకి..

ముషీరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో 2016లో వేసిన పవర్ బోరు ఎట్టకేలకు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. లక్షలు వెచ్చించి బాపూజీనగర్‌లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరు ఇంచుల పవర్ బోర్ వేసి వాటర్ ట్యాంక్‌కు కనెక్షన్ ఇచ్చారు. కానీ సంవత్సరాలు గడుస్తున్నా విద్యుత్ కనెక్షన్ లేకపోవడం వల్ల ఉపయోగంలోకి రాలేదు. స్థానికులు జలమండలి, స్థానిక ప్రజా ప్రతినిధులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పవర్‌బోర్ అందుబాటులోకి రాలేదు. ఎట్టకేలకు స్థానిక కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ చొరవ తీసుకొని శనివారం జలమండలి, విద్యుత్‌శాఖ అధికారులకు విజ్ఞప్తి చేయడంతో వారు శనివారం విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతోపాటు పాడైన పవర్‌బోరుకు మరమ్మతు పనులు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో యూనియన్ నేతలు

ఆటోలకు పర్మిట్లు ఇవ్వడం పట్ల హర్షం

బర్కత్‌పుర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా 65వేల ఆటోరిక్షాలకు ప్రభుత్వం పర్మిట్‌ల జారీకి ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమని అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) ఆటో యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా కొత్త ఆటోలకు పర్మిట్‌లు జారీ చేయడం అభినందనీయం అన్నారు. హామీలకు అనుగుణంగా ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేకేసీ నేతలు కౌశల్, సమీర్, ఎ.శరత్‌కుమార్, మహ్మద్ ఫారూక్, ఆటో యూనియన్ నాయకులు శివ, మహ్మద్ ఉమర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'గో సంరక్షణలో భాగస్వాములు కావాలి'

కవాడిగూడ , జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గో సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వాసవిక్లబ్ సికింద్రాబాద్ ప్రతినిధులు అన్నం సాయి సునిత, పల్లా నరేందర్, పి.జగన్, కిషోర్, మరిపెల్లి సుదాన్యాలు పిలుపునిచ్చారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శివాలయంలో శనివారం వాసవి క్లబ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉదయాస్తమాన సేవ కార్యక్రమంలో భాగంగా గోవులు ఆరోగ్యంగా ఉండేలా గోషాలలో గరుకు స్తంభ స్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవధను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకొని గోవులను రక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మురారిశెట్టి కేశవరాజు, వెంకటేష్, ప్రవీణ్, నవీన్, ఉదయ్ శర్మ, మహేష్, సీహెచ్ గోపాల్, రమేష్‌గౌడ్, మనోజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి గోల్నాక డివిజన్ మారుతీనగర్‌లో బస్తీ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బస్తీకమిటీ అధ్యక్షుడు ఎ.సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, కోశాధికారి నవ్‌కాంత్, కమిటీ ప్రతినిధులు, బస్తీపెద్దలు పాల్గొన్నారు.

– గోల్నాక, జూన్ 14 (ఆంధ్రజ్యోతి)


కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

- ఉన్నికోటలో 21 నెలలుగా జీ ప్లస్ వన్ స్లాబుల వరకే పనులు
- కాంట్రాక్టర్, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- శుభకార్యాలు, సమావేశాల నిర్వహణకు బస్తీవాసుల ఇబ్బందులు


కవాడిగూడ ఉన్నికోటలో జీ ప్లస్ వన్ స్లాబుల వరకే జరిగిన కమ్యూనిటీహాలు నిర్మాణ పనులు

కవాడిగూడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ ఉదాసీన వైఖరి వల్ల కోటీ పదిలక్షల రూపాయలతో చేపట్టిన కమ్యూనిటీహాలు నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కవాడిగూడ డివిజన్‌లోని ఉన్నికోటలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కాన్‌స్టెన్సీ డెవలప్‌మెంట్ ఫండ్ (సీడీఎఫ్) కింద కోటి పది లక్షల రూపాయాలు మంజూరయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సెప్టెంబరు నెలలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఉన్నికోటలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమై దాదాపు 21 నెలలు గడుస్తున్నా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు జీ ప్లస్ వన్ స్లాబుల వరకు మాత్రమే పనులు జరిగాయి. ప్రస్తుతం పనులు నిలిపి వేశారు. దీంతో స్థానికులు చిన్నచిన్న శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అధికారులను, కాంట్రాక్టర్‌ను పలుమార్లు ప్రశ్నించినా సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేసి సదుపాయాలు కల్పించాలని బస్తీవాసులు కోరుతున్నారు.

కమ్యూనిటీహాలు నిర్మాణం పూర్తి చేయాలి



కవాడిగూడ ఉన్నికోటలో ఎమ్మెల్యే కోటా నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదు. దీనివల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 21 నెలలుగా రెండు స్లాబులు వేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు. వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

- జి రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: గోపాల్


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. శనివారం బోలక్‌పూర్‌లోని గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్‌లో సొసైటీఫర్ రూరల్ డవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ), జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, రెయిన్‌బోహోమ్స్ కమ్యూనిటీ కేర్ సంస్థల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో పేదలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా 300ల మందికి ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, దంతపరీక్షలు, నేత్ర పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు గోవింద్‌రాజ్, ప్రవీణ్, కళ్యాణ్, కృష్ణ, మహేష్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి : కాలేరు


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

గోల్నాక, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం గోల్నాక తులసీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 35మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.14లక్షల90వేల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎ.సురేష్‌గౌడ్, ఆర్.కె.బాబు, రెడపాక రాము, పడకంటి అంజయ్యచారి, రుద్రయ్య, సి.నర్సింగ్ ముదిరాజ్, మిర్యాల రవీందర్, రాముయాదవ్, పి.సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

అంబర్‌పేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మహిళల కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, మహిళలు పాల్గొన్నారు.

'ఆహ్వానపత్రిక, మెమోంటోలపై గద్దర్ చిత్రపటం లేకపోవడం బాధాకరం'

నల్లకుంట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్ - 2024 ఆహ్వానపత్రికపై, మెమోంటోలపై ప్రజాగాయకుడు గద్దర్ చిత్రపటం లేకపోవడం బాధాకరమని దళిత సేన తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి అన్నారు. శనివారం హైదర్‌గూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ గద్దర్ ఫిలిం అవార్డ్స్ ప్రకటించిన ప్రభుత్వం గద్దర్‌ను అవమాన పరుస్తోందని ఆరోపించారు. ఆహ్వాన పత్రికలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర సినిమా ఆటోగ్రాఫిక్ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఫిలిం ఛాంబర్ ఛైర్మన్ దిల్‌రాజ్ మినహా గద్దర్ ఫొటో లేకపోవడం పట్ల ఆమె తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు.

ప్రముఖ న్యాయవాది వెంకట రామారావుకు నివాళి

నల్లకుంట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది ఉరే వెంకట రామారావు మృతి పట్ల తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శనివారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో ఉరే వెంకట రామారావు మృతి పట్ల సంతాపం సమావేశం ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రాహ్మణ సమాజానికి ఎనలేని సేవ చేసిన న్యాయవాది రామారావు మృతి బ్రాహ్మణ వర్గానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి నాయకులు కానాల శ్యాంసుందర్‌రావు, దేవులపల్లి రంగారావు, చెన్నూర లక్ష్మీనరసింహారావు, ప్రసాదరావు, జయరాం తదితరులు పాల్గొన్నారు.


అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాగభూషణం, తదితరులు

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నేత

రాంనగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వి.నాగభూషణం కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. అంజన్‌కుమార్‌యాదవ్ ఆయనకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చాలా కాలం పనిచేసిన నాగభూషణం బీఆర్ఎస్‌లోకి వెళ్లి తిరిగి సొంత పార్టీలోకి రావడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ప్రధాన కార్యదర్శి ఎస్. మనోహర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, అంజియాదవ్, నవీన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్ తదితరులు

ముషీరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు అంకిత భావంతో పనిచేస్తూ బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని బోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు సూచించారు. శనివారం బోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం రంగానగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పార్టీ అధిష్ఠానం, ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాల మేరకు ప్రతి నెలా పోలింగ్ బూత్‌ల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, గోవింద్‌రాజ్, మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మగ్బూల్, సోషల్‌మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్, నాయకులు కృష్ణ, మహేష్, కళ్యాణ్, ఆజీపాషా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను బూత్‌స్థాయి నుంచి..

చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీని బూత్‌స్థాయి నుంచి పటిష్ఠం చేయాలని ఆ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం. రాకేష్‌కుమార్ సూచించారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శనివారం జవహర్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగింది. అధ్యక్షత వహించిన రాకేష్ మాట్లాడుతూ ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త, నాయకుడు ప్రతినిత్యం పార్టీ కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గాంధీనగర్ డివిజన్‌లో విజయం సాధించేందుకు ఇప్పట్నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పార్టీ నేతలు ముఠా నరేష్, షన్ను సత్యనారాయణ, పాశం రవి, వెంకటేష్, శివసింహ, కృష్ణప్రసాద్, కిరణ్, నవీన్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకు పనిచేసే వారికే పదవులు


కల్పనాయాదవ్‌ను సన్మానిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, తదితరులు

రాంనగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత కోసం పనిచేసే వారందరికీ పార్టీలో, నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పిస్తామని రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్ శనివారం అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్పనాయాదవ్ రెండుమార్లు కార్పొరేటర్‌గా గెలిచి ప్రజలకు సేవ చేయడమే కాకుండా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని నమ్ముకుని పటిష్ఠతకు కృషి చేశారని తెలిపారు. కల్పనాయాదవ్ మాట్లాడుతూ తాను అందించిన సేవలకు గానూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్‌కుమార్‌యాదవ్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం నేతలు

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వడ్డెర సంఘం నేతలు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెరసంఘం తెలంగాణ(గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య, ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ జెరిపేటి జైపాల్, వడ్డెర సంఘం ట్రస్ట్ ఛైర్మన్ సత్యనారాయణరాజు, కృష్ణయ్య, వెంటేష్, లక్ష్మీనారాయణ, రాములు, సత్యనారాయణ, రాములు, వెంకటకృష్ణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు యానాదుల ఆత్మగౌరవ సభ

రాంనగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యానాదుల సంక్షేమం, అభివృద్ధి, ఐక్యత కోసం యానాదుల ఆత్మగౌరవ సభను ఆదివారం(నేడు) తార్నాక మెట్టుగూడ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర యానాది (గిరిజన) వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. లలితానగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు సాంబశివరావు, చిన్న శేషాద్రి, శ్రీనివాస్‌లు మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా షెడ్యూల్డ్ ట్రైబల్స్ నేషనల్ కమిషన్ సభ్యులు హుస్సేన్, ఐఏఎస్ అధికారులు ఐ.శ్రీధర్, సారధి, ఆంజనేయులు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు రమణ హాజరవుతారని తెలిపారు.

రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలి

- 22న మున్నూరుకాపుల రాష్ట్రస్థాయి సమావేశం

బర్కత్‌పుర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులు రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడలోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం గ్రేటర్ అధ్యక్షుడు ఆర్‌వీ మహేందర్‌కుమార్, వాసాలి వెంకన్న పటేల్, డాక్టర్ విశాల్‌పటేల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మున్నూరుకాపుల్లో ఐక్యత లేకపోవడం వల్లే రాష్ట్ర మంత్రి వర్గంలో ఒక్క మున్నూరుకాపు లేడని ఆయన అన్నారు. వచ్చే మంత్రి వర్గ విస్తరణలోనైనా మున్నూరుకాపులకు ప్రాధాన్యమివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 22న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పలు డిమాండ్లపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ఆయన చెప్పారు.

రజక సంక్షేమ సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా రాజు


రాజుకు నియామకపత్రం అందజేస్తున్న భిక్షపతి

చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రజక సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా ఇంద్రాల రాజు నియమితులయ్యారు. శనివారం ఆయనకు సంఘం అధ్యక్షుడు ముప్పు భిక్షపతి నియామక పత్రం అందజేశారు. రజకుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని రాజు అన్నారు.

బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా విశ్వేశ్వర్


విశ్వేశ్వర్

ముషీరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా విశ్వేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్ ప్రకటించారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విశ్వేశ్వర్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషిచేస్తానని అన్నారు.

రైలు ప్రయాణికురాలి బంగారు గొలుసు, నగదు చోరీ

బర్కత్‌పుర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బంగారు గొలుసు, నగదును దొంగలు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన కాంచన సింగ్వీ(62) జాల్నా నుంచి కాచిగూడకు రావడానికి అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు నాందేడ్ వద్ద ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను దొంగలు అపహరించారు. ఆ హ్యాండ్‌బ్యాగ్‌లో 8గ్రాముల బంగారు గొలుసు, రూ.21,500 నగదు ఉంది. శనివారం కాంచన సింగ్వీ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీచేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.